సాక్షి
ఆదిలాబాద్

సోమవారం ; 13 ; మే ; 2024



ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తాం

ఈరోజు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో యువ ఓటర్లు మొదటిసారి ఓటేయబోతున్నారు. నిజాయతీపరులకు ఓటేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తామని చెబుతున్నారు. 2లో▸



గాలివాన బీభత్సం

తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక ఇల్లు కూలగా, పలు చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. 3లో▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0/27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు నిలకడగా ఉంటాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూం పరిశీలన

బోథ్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్‌రూంను ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. అనంతరం బోథ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు.

ఘనంగా మహాలింగార్చన చండీయాగం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, భక్తులు

కైలాస్‌నగర్: జగద్గురు శంకరాచార్య జయంత్యుత్సవాల సందర్భంగా లోక కల్యాణార్థం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీగోపాలకృష్ణ మఠంలో వైదిక పురోహిత అర్చక బ్రాహ్మణ సంఘం వారు ఆదివారం మహాలింగార్చన చండీయాగం నిర్వహించారు. హంపి విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి ఆశీస్సులతో, గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఈ యాగాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై హంపి పీఠాధిపతి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్, దినేశ్‌కుమార్ మటోలియా, వేదపండితులు పాల్గొన్నారు.

పోలింగ్‌శాతం పెరిగేనా?

కైలాస్‌నగర్: సోమవారం నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌శాతం పెంచేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 11మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పార్లమెంట్ పరిధిలో 13,82,837 మంది ఓటర్లుండగా 10,63,730 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 6,82,198 మంది, మహిళలు 7,00,431 మంది ఓటేశారు. పోలింగ్ 77.9 శాతంగా నమోదైంది. నోటాకు 13,036 ఓట్లు పోలయ్యాయి. పట్టణ ప్రాంతాల కంటే పల్లెల్లోనే పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 16,50,175 మంది ఓటర్లున్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులు ఆటపాటల ద్వారా చైతన్యపరిచారు. అయితే వాతావరణం ఒక్కసారిగా మారింది. వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఏ మేరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేస్తారో వేచి చూడాల్సిందే.

ఓటు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటేయాలని స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. ఓటు వినియోగంపై స్వీప్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి చేపట్టిన ర్యాలీని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత జెండా ఊపి ప్రారంభించారు. అశోక్‌రోడ్ , కోలిపుర, గాంధీచౌక్‌ల వద్ద ఇంటింటికీ వెళ్లి ఓటు విలువపై అవగాహన కల్పించారు. అనంతరం 96 ఏళ్ల వృద్ధురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు వత్సల భాయిని సన్మానించారు. జిల్లా సంక్షేమాధికారిణి సబిత, డీపీఆర్వో తిరుమల, మెప్మా డీపీఎం శ్రీనివాస్, రాంసింగ్, శంకర్‌దాస్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం



పల్లకితో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేల: బెదోడ గ్రామంలో వారంరోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులను దేవతల వేషధారణలతో ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో ఊరేగించారు. అనంతరం బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. చివరగా కాలదహీ హండీ చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



చంటిబిడ్డతో విధులకు బయలుదేరిన మహిళా ఉద్యోగి



పంపిణీ కేంద్రంలో ఉద్యోగితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నేడే ఓట్ల పండుగ

- ఉదయం 7నుంచి సాయంత్రం 6వరకు..
- 'మావో' ప్రభావిత ప్రాంతాల్లో 4వరకే..
- వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రక్రియ పర్యవేక్షణ
- ఇప్పటికే ఏర్పాట్లు చేసిన అధికారులు
- పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు సిబ్బంది

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	16,50,175
పురుషులు	8,04,875
మహిళలు	8,45,213
ఇతరులు	87

పోలింగ్ స్టేషన్లు, సిబ్బంది వివరాలు

పోలింగ్ స్టేషన్లు	2,200
పీవోలు	2,637 మంది
ఏపీవోలు	2,637 మంది
ఓపీవోలు	5,274 మంది
మొత్తం	10,548 మంది



ఈవీఎం, వీవీప్యాడ్లను తెస్తున్న మున్సిపల్ సిబ్బంది



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది



వాహనంలో కేంద్రాలకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజు రానే వచ్చింది. సోమవారం జరిగే ఓట్ల పండుగకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాధారణ ప్రాంతాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు, మావోయిస్టు ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. సోమవారం వేకువజామున ఆయా కేంద్రాల్లో సిబ్బంది ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి ఆ తర్వాత సాధారణ పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు.

పోలింగ్ పర్యవేక్షణలో..

ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా వ్యవహరిస్తున్నారు. సాధారణ పరిశీలకుడిగా రాజేంద్ర విజయ్ ఉన్నారు. నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో పాటు మూడు జిల్లాల అదనపు కలెక్టర్లు కూడా పర్యవేక్షణలో పాల్గొంటున్నారు.

249 రూట్లలో కేంద్రాలకు..

ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఆదివారం సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేశారు. దీంట్లో ఈవీఎంలతో పాటు కంట్రోల్ యూనిట్ (సీయూ), బ్యాలెట్ యూనిట్ (బీయూ)లతో పాటు ఇతర పోలింగ్ సామగ్రి ఉన్నాయి. వీటిని తీసుకుని సాయంత్రం వరకు కేటాయించిన కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. కాగా, ఏఆర్వోల సూచన మేరకు ఆయా రూట్లలో పోలింగ్ సామగ్రిని తీసుకువెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు. ఆ రూట్లలో సెక్యూరిటీ ఆఫీసర్లను నియమించారు. సిర్పూర్ 40, ఆసిఫాబాద్ 51, ఖానాపూర్ 31, ఆదిలాబాద్ 33, బోథ్ 35, నిర్మల్ 28, ముథోల్ 31.. మొత్తంగా 249 రూట్లలో పోలింగ్ సిబ్బంది సామగ్రిని తీసుకుని ఎస్కార్ట్ పోలీస్ సాయంతో ఆయా రూట్లలో బయల్దేరి కేంద్రాలకు చేరుకున్నారు.

వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ

గుర్తించిన పోలింగ్ స్టేషన్లను అనుక్షణం వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 1,837 పోలింగ్ స్టేషన్లలో ఇన్‌సైడ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. 677 పోలింగ్ స్టేషన్లలో అవుట్‌సైడ్ కెమెరాలు బిగించారు. కాగా, రవాణా, కమ్యూనికేషన్ సరిగా లేని పోలింగ్ స్టేషన్లను షాడో పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ఇలాంటివి ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 96 ఉండగా, అక్కడ ప్రత్యామ్నాయ పద్ధతిలో వీహెచ్ఎఫ్ సెట్లను కమ్యూనికేషన్ కోసం ఏర్పాటు చేశారు. 134 రూట్లలో 259 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లుండగా, అక్కడ 190 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

ఎస్పీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ..

ఆయా జిల్లాల్లో పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆదిలాబాద్‌లో ఎస్పీ గౌస్ ఆలం, నిర్మల్‌లో ఎస్పీ జానకి షర్మిల, కుమురంభీం ఆసిఫాబాద్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతోంది. పోలీసులు, కేంద్ర బలగాలు, బెటాలియన్ సిబ్బందిని నియమించారు. ఒక్కో జిల్లాలో సుమారు 1,500 నుంచి 2వేల మంది వరకు బందోబస్తులో పాల్గొంటున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, మహిళా ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఇలా అందరు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ సమయం

- ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.
- ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ప్రక్రియ పూర్తి చేస్తారు.

13 కార్డులలో ఒకటి తప్పనిసరి..

ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఓటర్లు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. 13 కార్డులలో ఓటరు కార్డు, ఆధార్ కార్డు, ఎన్ఆర్ ఈజీఎస్ జాబ్‌కార్డు, ఫొటోతో ఉన్న పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డుల్లో ఏదైన ఒకటి వెంట తీసుకెళ్లాలని చెబుతున్నారు.

రాత్రికి స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు..

వివిధ నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయిన తర్వాత సిబ్బంది పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో సోమవారం రాత్రి వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను చేర్చాల్సి ఉంటుంది. టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు, పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఆసిఫాబాద్, సిర్పూర్ స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సామగ్రితో వెళ్లారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో, బోథ్‌కు సంబంధించి అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఖానాపూర్‌కు సంబంధించి ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది ఉదయం 9గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకుని సహాయ రిటర్నింగ్ అధికారులు వినోద్‌కుమార్, చాహత్ బాజ్‌పేయ్, జీవాకర్‌రెడ్డికి రిపోర్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి 907 పోలింగ్ కేంద్రాలకు ఆయా రూట్ల వారీగా 2,172 మంది ఉద్యోగులు, సిబ్బందికి అధికారులు పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఈవీఎంల పని తీరు, మాక్ పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బంది సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు అధికారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో బందోబస్తు మధ్య చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీ సెంటర్‌లో ఆర్డీవో వినోద్‌కుమార్, బోథ్‌లో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్‌లో ఆర్డీవో జీవాకర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదిలాబాద్, బోథ్‌లో సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఆదిలాబాద్, ఉట్నూర్‌లోని పంపిణీ కేంద్రాలను ఎస్పీ గౌస్ ఆలం పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, సహాయకులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కాగా, సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా మూడంచెల పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మెటల్ డిటెక్టర్లతో కూడిన మార్గం నుంచి లోనికి సిబ్బందిని అనుమతించారు. ఎండల తీవ్రత కారణంగా షామియానాలు వేశారు. తాగునీటి వసతి కల్పించారు. కూలర్లు ఏర్పాటు చేశారు. వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకే ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందునా పోలింగ్ సమయాన్ని ఈసారి సాయంత్రం 6 గంటల వరకు పెంచారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఓటు తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– రాజర్షిషా, పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆదిలాబాద్

భద్రత కట్టుదిట్టం

- జిల్లాలో భారీ బందోబస్తు
- 350 సీసీ కెమెరాలతో నిఘా
- ఎస్పీ ఆఫీస్‌లో కంట్రోల్‌రూమ్



హాజరైన పోలీస్ సిబ్బంది



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం నిర్వహించనున్నందున జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తోంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను గుర్తించగా అక్కడ కేంద్ర బలగాలు పహారా కాస్తున్నాయి. ఇప్పటికే ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్, ఓటర్ల చైతన్యం కోసం అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో 350 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. వీడియో చిత్రీకరణతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా 582 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశారు. ఎస్పీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమస్య ఉంటే 08732–226246, కంట్రోల్ రూమ్ 8712659906, వాట్సాప్ 8712659973 నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

బందోబస్తు విధుల్లో..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు 1,500 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. 27 సెక్షన్ల సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలు, 15 సెక్షన్ల టీఎస్‌పీ ఎస్పీ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో నాలుగు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందిని, 19 పోలీస్‌స్టేషన్లలో స్ట్రైకింగ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచారు. ఏవైన ఆందోళనలు చోటుచేసుకుంటే వెంటనే అక్కడికి వెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతారు. పోలింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్లలోపు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆదివారం ఈవీఎంలు తరలించే క్రమంలో రూట్ మొబైల్ పార్టీ వెంట ఎస్కార్ట్‌గా పోలీసులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. సోమవారం సాయంత్రం ఎన్నికలు ముగిసిన తర్వాత ఈవీఎంలను టీటీడీసీ, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలికల గురుకుల సంక్షేమ కళాశాలల్లో భద్రపర్చనున్నారు. మూడంచెల భద్రత వలయం ఏర్పాటు చేశారు. సీఆర్పీఎఫ్, జిల్లా పోలీసులు, ఆదిలాబాద్ పట్టణ పోలీసులతో నిఘా చేపట్టనున్నారు.

కొనసాగుతున్న నిఘా..

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నుంచి జిల్లాలో ఏడు అంతర్రాష్ట్ర, మూడు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లాకు వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీంతోపాటు మొబైల్ పార్టీ, స్ట్రైకింగ్ ఫోర్స్, క్లస్టర్ పెట్రోలింగ్ పోలీసులతో ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఇప్పటివరకు 260 కేసులు, 582 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలించిన రూ.65లక్షల 33వేల 920 నగదు, అక్రమంగా నిల్వ ఉంచిన 3,049 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.12.44లక్షలు ఉంటుందని పోలీస్ అధికారులు తెలిపారు. 53 కిలోల గంజాయిని సీజ్ చేయగా, వీని విలువ రూ.16.36లక్షల విలువ ఉంటుందని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి మద్యం దుకాణాలు మూసివేశారు. సోమవారం సాయంత్రం 6వరకు వీటిని తెరవరు. ఎన్నికల నేపథ్యంలో మద్యం పంచకుండా చర్యలు చేపడుతున్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం

ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక పోలీస్ బలగాలతో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాం. ఓటర్లు నిర్భయంగా కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలి. ఎవరైనా భయాందోళనకు గురిచేసినా, ప్రలోభ పెట్టినా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలి. లేదా 'డయల్ 100'కు కూడా సమాచారం ఇవ్వొచ్చు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు 144 సెక్షన్ అములులో ఉంటుంది.

– గౌస్ ఆలం, ఎస్పీ

'ఆదర్శ' కేంద్రాలు అదరహో..



ప్రభుత్వ గిరిజన కొలాం ఆశ్రమ పాఠశాలలో..



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఓటర్లను ఆకట్టుకునేలా అధికారులు పలు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహిళలు, దివ్యాంగులు, యువతకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పించారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదేసి చొప్పున మహిళల కోసం 10 కేంద్రాలు ఏర్పాటు చేయగా, యువత, దివ్యాంగుల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున రెండు ఏర్పాటు చేశారు. ఆదర్శ కేంద్రాలుగా ఆదిలాబాద్‌లో ఐదు, బోథ్ నియోజకవర్గంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిని సుందరంగా ముస్తాబు చేశారు. – కైలాస్‌నగర్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం




శోభాయాత్రలో జెడ్పీ చైర్మన్, గ్రామస్తులు

నార్నూర్: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌక్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. హనుమాన్ ఆలయం నుంచి కలశం ద్వారా పవిత్ర జలాన్ని యువతులు తీసుకెళ్లారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ అడే సురేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, జేఏసీ నాయకుడు డాక్టర్ నారాయణ్, మాజీ ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, రాథోడ్ ఉత్తమ్ తదితరులున్నారు.

ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తాం..

- నిజాయతీపరులకే ఓటేస్తాం
- నూతన ఓటర్ల మనోగతం
- నేడే పార్లమెంట్ ఎన్నికలు

దేశ పౌరులందరికీ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు ముఖ్యమైంది. ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు ఉన్న ప్రాధాన్యత మరి దేనికి లేదు. సర్పంచ్ మొదలుకొని ప్రధాని దాకా ప్రజలు వేసే ఓట్లతో గద్దెనెక్కాల్సిందే. మన తల రాతల్ని మార్చే నేతల్ని ఎన్నుకునే వజ్రాయుధం ఓటు. పేద, ధనిక తేడా లేకుండా అందరికీ రాజ్యాంగం కల్పించిన సమానమైన హక్కు. తొలిసారి నేటి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయబోతున్న పలువురు యువతీ, యువకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..



ఉద్యోగావకాశాలు పెంచాలి



కౌటాల: ప్రభుత్వం సరైన ఉద్యోగావకాశాలు కల్పించ లేదు. ఉన్నత చదువులు చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నా. నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చే వారికే నా తొలి ఓటు వేస్తా. గ్రామీణ ప్రాంతాల్లో యువతులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

– బి.తరుణ్, డిగ్రీ విద్యార్థి, కౌటాల

వ్యక్తిత్వం ముఖ్యం



కౌటాల: ప్రజలు ఓటేసి గెలిపించుకునే నాయకుడి వ్యక్తిత్వం చాలా ముఖ్యం. నిజాయతీ కలిగి ఉండాలి. అలాంటివారే న్యాయం చేయగలరు. బరిలో ఉన్న అభ్యర్థుల గుణగణాలు తెలుసుకున్నాకే ఓటు వేస్తా. యువతులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి.

– కె శృతి, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

బాధ్యతగా ఓటు వేయాలి



కుంటాల: ఎన్నికల్లో ఓటు వేయడం సామాజిక, రాజ్యాంగ బాధ్యతగా యువత గుర్తించాలి. దేశ భవిష్యత్, రాజకీయాలు యువత చేతుల్లో ఉంది. ఓటుతోనే సమాజాన్ని మార్చాలన్న లక్ష్యంతో తొలిసారి ఓటు వేస్తున్నా.

– శ్రీరాంవార్ శ్రీనిజ, కుంటాల

ఆనందంగా ఉంది



లక్ష్మణచాంద: లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటు వినియోగించబోతున్నా. చాలా ఆనందంగా ఉంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచినేతను ఎన్నుకునేందుకు ఓటు చేస్తా.

– జడ్డి నిఖిల్, పొట్టపెల్లి

ఆరునెలల్లో రెండోసారి..



భైంసాటౌన్: ఆరునెలల కిందటే మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నా. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి ఓటు వేయబోతున్నా. ఆరునెలల్లోనే రెండుసార్లు ఓటు వేసే అవకాశం వచ్చింది.

– సుశీల్, యువకుడు, భైంసా

పదిహేనేళ్లలో తొలిసారి



బెల్లంపల్లి: నాకు ఓటు హక్కు వచ్చి పదిహేనేళ్లవుతోంది. ఇంతవరకు ఓటు వినియోగించుకోలేకపోయాను. వృత్తిరీత్యా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తున్నా. ఎన్నికల సమయంలో ఎమర్జెన్సీ డ్యూటీ వల్ల సెలవు దొరికేది కాదు. ఈసారి అదృష్టవశాత్తు సెలవు మంజూరై ఇంటికి వచ్చాను. ఇప్పుడెంతో సంతోషంగా ఉంది. ఈసారి ఓటు వేస్తాను.

–ఎనగంటి రాజశేఖర్, మాదారం టౌన్‌షిప్, తాండూర్ మండలం

ఓటు వజ్రాయుధం



ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ప్రజాసేవ చేసే నాయకుడికి ఓటు వేస్తా.

– పిన్నా సాయితేజ, విద్యార్థి

నిస్వార్థంగా సేవచేయాలి



కౌటాల: ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లప్పుడు నిస్వార్థంగా సేవ చేయాలి. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేయాలి. నిజాయతీపరులైన అభ్యర్థికే నా తొలి ఓటు వేస్తా. ఎన్నికల వేళ అమలు కాని హామీలు ఇచ్చి మర్చిపోయే వారికి తగిన బుద్ధిచెబుతాం.

– రూపాలి, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

తొలిసారిగా..



ఇంద్రవెల్లి: తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. ప్రజల్లో ఉండే నాయకుడికే నా ఓటు. తోటి స్నేహితులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తా. ఓటు హక్కును వృథా కానివ్వను.

– మడావి గిరిజబాయి, వాల్గొండ గ్రామం

కాంచీపురం నుంచి వచ్చా..



నర్సాపూర్(జి): కాంచీపురం ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాను. తొలిసారి ఓటు వేసి వేసేందుకు తురాటి గ్రామానికి వచ్చాను. అర్హులందరూ ఓటు వేయాలి. ప్రజా నాయకుడికే నా తొలిఓటు.

– హృషిక్ రెడ్డి, తురాటి

ఎంతో థ్రిల్‌గా ఉంది



బెల్లంపల్లి: నాకు ఈసారే కొత్తగా ఓటు హక్కు వచ్చింది. ఓటు వేసే అవకాశం రావడం చాలా థ్రిల్‌గా అనిపిస్తోంది. ఎన్నికలపై కొంత అవగాహన ఉన్నా ఓటేసిన అనుభవం లేదు. ఫస్ట్‌టైమ్ ఓటేయాలని తపన నన్ను ఉక్కిరి బిక్కిరిచేస్తోంది.

– చింతసాయి గణేశ్ పటేల్, గొల్లపల్లి, నెన్నెల మండలం

సంతోషంగా ఉంది



ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ పూర్తయింది. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నా. లోక్‌సభ ఎన్నికలకు తొలిసారి ఓటువేస్తా. ఇష్టమైన ప్రజాప్రతినిధికి ఓటేయనుండడం సంతోషంగా ఉంది. ఓటు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి.

– కోలే నవీన్, మోతుగూడ, మం.ఆసిఫాబాద్

నిజాయతీపరుడికే ఓటు



పాతమంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా. చాలా సంతోషంగా ఉంది. నిజాయతీపరుడికే నా ఓటు చేస్తాను.

– ఐత రాంచరణ్ తేజ్, మంచిర్యాల

క్లుప్తంగా

మానవత్వం చాటిన నిర్మల్ ఎస్పీ



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్పీ జానకిషర్మిల

నిర్మల్‌టౌన్: ఎస్పీ జానకి షర్మిల మానవత్వం చాటారు. ఎన్నికల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో డీఆర్సీ తనిఖీ చేసి ఆదివారం తిరిగి వస్తున్నారు. స్థానిక జయశంకర్ చౌరస్తా వద్ద బైక్‌పై ఓ వ్యక్తి తన భార్య, పిల్లలతో కిందపడడాన్ని చూసి వాహనం ఆపి దిగారు. ఆ వ్యక్తికి రక్తస్రావం కావడంతో ఎస్పీ తన సెక్యూరిటీ వాహనంలో సిబ్బంది ద్వారా ప్రైవేట్ ఆస్పత్రికి పంపించారు. చికిత్స అనంతరం బాధితుడి యోగక్షేమాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వ్యక్తి ఆస్పత్రికి తరలించిన ఎస్పీని పలువురు అభినందించారు.

రూ.2.40 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా రూ.2.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఆదివారం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న నగదును సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఓటుకు దూరమవుతున్న డ్రైవర్లు

బోథ్: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులకు విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్, ఆర్టీసీ అద్దెబస్సులు, జీపులు, కారు డ్రైవర్లు ఓటుకు దూరమవుతున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తీసుకెళ్తున్న వాహనాల డ్రైవర్లకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించలేదు. సోమవారం వారు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాల్సిన పరిస్థితి. దీంతో తమ సొంత గ్రామాలకు వెళ్లి ఓటు వేయలేని పరిస్థితి నెలకొంది. దాదాపు 300 మంది ఓటుకు దూరమవుతున్నట్లు తెలుస్తోంది.

ఓటు వేయలేను



ఎన్నికల అధికారి కారు డ్రైవింగ్ చేస్తాను. సిరికొండ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి సిబ్బందిని తీసుకువెళ్తున్నాను. సోమవారం పోలింగ్ కేంద్రం వద్దనే ఉండడంతో ఓటుకు దూరమవుతున్నాను.

– అలీమ్, కారుడ్రైవర్, బోథ్

ఎన్నికల పందిరే



పందిరి వద్ద పంచాయతీ సిబ్బంది

సోన్: దివ్యాంగ, వృద్ధ ఓటర్లు వేసవి తాపం నుంచి రక్షణ కల్పించేందుకు పచ్చనిచెట్లతో పెళ్లి పందిరి లాగా, ఎన్నికల పందిరి వేశారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 125, 126 బూత్‌లకు సంబంధించి దివ్యాంగ, వృద్ధ ఓటర్ల కోసం ఈ పందిరి ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి కె.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎన్నికల సిబ్బందికి పందిరిలోకి స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు. రూట్ అధికారులు, ఐకేపీ, పోలీసులు పాల్గొన్నారు.

ఆన్‌డ్యూటీగా గుర్తించాలి

శ్రీరాంపూర్: ఎన్నికల విధుల్లో భాగంగా బందోబస్తుకు హాజరయ్యే సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి స్పెషల్‌లీవు కాకుండా ఆన్‌డ్యూటీగా గుర్తించాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్ ఓ ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వారిని ఆన్‌డ్యూటీగా పరిగణించి ప్లేడేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం స్పెషల్ లీవు అని ఇవ్వడంతో వారికి 4 మస్టర్ల ద్వారా వచ్చే పెయిడ్ హాలిడే, ఏడాదిలో వచ్చే ఇన్సెంటీవ్ ఇతర ఆర్థికపరమైన నష్టాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే కంపెనీ ఆన్‌డ్యూటీగా గుర్తిస్తూ ప్లేడే ఇవ్వాలని పేర్కొన్నారు.

అల్లంపల్లిలో భారీ వర్షం

కడెం: మండలంలోని మారుమూల ఆటవీ గ్రామం అల్లంపల్లిలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. అల్లంపల్లి, బాబానాయక్ తండా రెండు పోలింగ్ స్టేషన్‌లో చీకట్లో ఎన్నికల ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. విద్యుత్ సిబ్బంది త్వరితగతిన మరమ్మతు చేసి, సరఫరాను పునరుద్ధరించారు.



కురుస్తున్న వర్షం



జలమయమైన వ్యవసాయ భూములు




విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలను నిలదీయాలి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్రంలోని సింగరేణి ప్రాంతాల్లో గత 20 రోజులుగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటడంతో విధుల నిర్వహణలో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈక్రమంలో పనివేళల మార్పుపై అర్థంలేని ప్రకటన చేస్తున్న ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ సంఘాలను నిలదీయాలని మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం పత్రికలకు లేఖలు విడుదల చేశారు. ఓపెన్‌కాస్ట్ గనులు, సీహెచ్‌పీ వర్క్‌షాప్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎండల్లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సీఎండీతో చర్చల మేరకు పనివేళల మార్పుపై అంగీకరించిందని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ సంఘాలు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. పైరవీలకు అలవాటుపడిన సంఘాలు కార్మిక హక్కులను యాజమాన్యానికి తాకట్టు పెడుతున్నాయని ఆరోపించారు. ఈక్రమంలో 20 రోజులవుతున్నా పని గంటలు తగ్గించకపోగా చర్చల పేరిట కాలయాపన చేస్తూ కార్మికులపై పనిభారం మోపేలా సంఘాలు కారణమవుతున్నాయన్నారు. ఎలాంటి లక్ష్యాలు లేకుండా 6 గంటల పనిదినాన్ని అమలు చేస్తోందన్నారు. పని ప్రదేశాల్లో నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్మికుల పక్షాన నిలబడాలని, కార్మికులను మోసగించే పద్ధతులు మానుకోవాలని హెచ్చరించారు.

ఓటు కోసం వినూత్న ప్రచారం



పోస్టుకార్డుల ద్వారా ప్రచారం చేస్తున్న హైస్కూల్ మిత్ర బృందం

చెన్నూర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకోవాలని భారత ఎన్నికల సంఘం వివిధ రూపాల్లో ప్రచారం చేస్తోంది. వివిధ స్వచ్ఛంద సంస్థలు, పార్టీలు సైతం ఓటర్లను చైతన్యం చేస్తోంది. ఇందులో భాగంగా వినూత్నంగా చెన్నూర్ హైస్కూల్ మిత్ర బృందం పోస్టుకార్డులతో ప్రచారం చేయడం చర్చానీయాంశంగా మారింది. పోస్టుకార్డులో ఓటు విలువను తెలియజేస్తూ మిత్రులు, బంధువులతోపాటు సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని పోస్టుకార్డులో రాసిన సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఓటర్ స్లిప్‌లోనే పోలింగ్ కేంద్రం సమాచారం

మంచిర్యాలక్రైం: పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలియక కొందరు ఇబ్బంది పడుతుంటారు. వలసవెళ్లిన వారు మరికొందరు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు స్వగ్రామాలకు వస్తుంటారు. వీరి కోసం ఎన్నికల సంఘం ముందస్తుగా ఓటర్ స్లిప్‌లు అందిస్తోంది. అందులో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే ఓటు వేసే పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో గూగుల్ మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఓటరుకు సంబంధించిన సమాచారాన్ని క్యూఆర్‌కోడ్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

అదుపు తప్పి లారీబోల్తా

జైపూర్: మండల కేంద్ర సమీపంలో మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై అదుపుతప్పి ఇసుక లారీ బోల్తాపడింది. చెన్నూర్ నుంచి శ్రీరాంపూర్ వైపు ఇసుక లోడ్‌తో లారీ వెళ్తుంది. వెలిశాల మల్లన్న గుడి సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికి ఏమి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఆదివాసీ ఎరుకలను గుర్తించాలి

జైపూర్: అభివృద్ధికి దూరంగా ఉన్న ఆదివాసీ ఎరుకులను గుర్తించాలని ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ఎరుకల ప్రజలు విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వెనుకబడ్డారని తెలిపారు. ప్రభుత్వం కొన్ని గిరిజన కులాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, ఎస్టీ నిధులు తమకు అందడం లేదన్నారు. మే 23న ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉంద్రాల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి జగన్నాథుల మల్లేశ్, ఉపాధ్యక్షుడిగా కండ్లి సమ్మయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

గాలిదుమారం.. కుప్పకూలిన షామియానా



చిందరవందరగా పడిపోయిన కుర్చీలు, సామగ్రి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై గాలిదుమారం వీచింది. అరగంటకు పైగా వీచిన గాలిదుమారంతో ఇళ్లపై ఉన్న పైకప్పులు అక్కడక్కడ లేచిపోగా, ఎన్నికల అధికారులు, సిబ్బంది త్రుటిలో తప్పించుకున్నారు. పాతబస్టాండ్ ఏరియాలోని సింగరేణి తిలక్‌స్టేడియం మైదానంలో అధికారులు, సిబ్బందికి సామగ్రిని అందించడానికి డిస్ట్రిబూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటల వరకు సామగ్రి పంపిణీ చేయడంతో వాహనాల్లో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సరిగ్గా 6 గంటల సమయంలో ఈదురుగాలుల ధాటికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఏర్పాటు చేసిన షామియానా కుప్పకూలింది. కుర్చీలు గాలిలో లేచిపడ్డాయి. సౌండ్‌సిస్టం చిందరవందర కాగా, విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొద్దిమంది సిబ్బంది ఉండగా గాలిదుమారం తీవ్రతను గ్రహించి తిలక్ స్టేడియానికి పరుగులు పెట్టారు.

గాలివాన బీభత్సం

ఉమ్మడి జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. బలమైన గాలులు వీయడంతో పలు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


పాల్వంచ మండలం వాడిలో తడిసిన ధాన్యం


కామారెడ్డి జిల్లా కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం


గజ్యానాయక్ తండా చౌరస్తాలో వర్షం నీరు


మైసమ్మ చెరువుతండాలో రేకులు ఎగిరిపోయి మిగిలిన గోడలు

ఎల్లారెడ్డిరూరల్/రాజంపేట/లింగంపేట: నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్‌లో రేకుల షెడ్డు ఎగిరి కింద పడింది. మండలంలోని గోపాల్‌పేట్, తాండూర్ గ్రామాలలో వడగండ్ల వర్షం కురిసింది. రాజంపేట మండలంలో ఆరబెట్టిన వరిధాన్యం తడిసిపోయింది. లింగంపేట మండలంలో సైతం ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాచారెడ్డి: వర్షానికి మండలంలోని మైసమ్మ చెరువు తండా, పాల్వంచ మండలం వాడి, గజ్యానాయక్ తండా చౌరస్తాలో సైడ్ డ్రెయినేజీ లేక ఇళ్లలోకి నీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మైసమ్మ చెరువు తండాలో గాలికి బుక్యా విజయకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. పాల్వంచ మండలం వాడిలో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయింది. గజ్యానాయక్ తండా చౌరస్తాలో డ్రెయినేజీలు లేకపోవడంతో వరద నీరు ఇళ్ల లోకి వచ్చి చేరుతుంది.

గాంధారి: మండలంలోని సోమారం తండాలో కేతావత్ గప్పునకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయింది. ఇంటి ముందు పాక కూలి పోవడంతో పాకలోని ఎద్దు కాలు విరిగిందని బాధితుడు తెలిపారు. వండ్రికల్ గ్రామంలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు కాలిపోయింది.

మోపాల్: మండలంలోని మంచిప్ప, ముదక్‌పల్లి శివార్లలో ఈదురుగాలులకు 2 డీపీ ట్రాన్స్‌ఫార్మర్లు, 14 విద్యుత్‌స్తంభాలు కూలిపోయాయి. ముదక్‌పల్లిలోని చిలుకల చిన్నమ్మ ఆలయ సమీపంలో కారుపై చెట్టు విరిగిపడింది. కాగా ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. గాలులకు తెగిపడ్డ తీగలు, స్తంభాలను గుర్తించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం కురిసిన వర్షంతో గాంధీ గంజ్‌లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. గాలులకు ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షపు నీటి ప్రవాహానికి ధాన్యం కొట్టుకుపోయాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు.


సోమారం తండాలో ఎగిరిపోయిన రేకులు


ఆత్మకూర్‌లో ఎగిరిపోయిన రేకులు


మంచిప్పలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్


వండ్రికల్‌లో పిడుగు పడి కాలిపోతున్న చెట్టు

మండుటెండలో నిండుకుండలా..


కాలువ నీటిని ఆధారం చేసుకొని ఏర్పాటు చేసిన పంపుసెట్లు

- కాకతీయ కాలువలో నీటి నిల్వ
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు
- ముందస్తుగా పంటల సాగుకు అనుకూలం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువ మండుటెండల్లోనూ నిండుకుండలా ఉంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువలో ఏడాదిపొడుగునా నీరు నిల్వ ఉండటంతో కాలువకు ఇరు వైపులా భూ గర్భజలాలు సమృద్ధిగా ఉంటున్నాయి. కాలువలోని నీటిని ఆధారంగా చేసుకొని రైతులు పంపు సెట్‌లను ఏర్పాటు చేసుకొని నీటిని వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం కూడా కాలువలో నీరు సమృద్ధిగా నిల్వ ఉంచారు. జిల్లాలోని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామం వద్ద కాకతీయ కాలువ క్రాస్ రెగ్యులేటర్‌ను దించి కాలువలో నీటిని నిల్వ ఉంచుతున్నారు.

50 క్యూసెక్కులకు జీవో

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల లేని సమయంలో కాలువలో నీటి నిల్వ కోసం ప్రతి రోజూ 50 క్యూసెక్కుల నీటిని నిరంతరం విడుదల చేపట్టాలని ప్రత్యేక జీవోను ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి కాలువలో నీరు నిల్వ ఉంటోంది. కాకతీయ కాలువ నిర్మాణంలో ఆయా గ్రామాల ఊర చెరువులను కోల్పోయారు. దీంతో నీటిని నిల్వ చేసేందుకు అవకశం లేకపోవడంతో కాలువలోనే నీటిని నిల్వ చేసేలా ప్రత్యేక జీవోను ఆయకట్టు రైతులు సాధించుకున్నారు. 2017లో లీకేజీ నీటి కోసం ఆయకట్టు రైతులు పెద్ద ఉద్యమమే చేపట్టారు. దీంతో దిగి వచ్చిన ప్రభుత్వం నీటి నిల్వ కోసం అవకాశం కల్పించింది.

ముందస్తు సాగుకు అవకాశం

కాకతీయ కాలువలో నిల్వ ఉండే నీరు ఆధారంగా రైతులు పంపు సెట్లను ఏర్పాటు చేసుకున్నారు. కాలువ నుంచి పంట భూముల వరకు పైపు లైన్ వేసుకున్నారు. కొందరు రైతులైతే ఏకంగా 4 నుంచి5 కిలోమీటర్ల దూరం వరకు కూడా పైపులైన్ వేశారు. కాలువలో నీరు ఎప్పుడూ నిల్వ ఉంటుండడంతో ప్రస్తుత ఖరీఫ్‌లో పంటలను ముందస్తుగా సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కాలువ నీరు ఆధారంగా రైతులు పసుపు, మక్క, సోయా, వరి పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాలువలో నీటిని నిల్వ ఉంచేందుకు చర్యలు తీసుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నీరు అందుతుంది



కాకతీయ కాలువలో ఎండా కాలంలో కూడా నీరు నిల్వ ఉండటంతో పంటలకు ఎల్లప్పుడూ నీరందుతోంది. కాలువ నీరు ఆధారంగా పంపు సెట్ బిగించి పైపు లైన్ వేశాను. ఖరీఫ్‌లో పంటలను ముందుగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాను. ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం. – ఆకుల రాజన్న, రైతు

గల్ఫ్‌ను తాకిన ఎన్నికల వేడి

- కార్మికుల క్యాంపులలో ప్రచారం నిర్వహించిన మూడు పార్టీల నేతలు


దుబాయ్‌లోని లేబర్ క్యాంపులో ప్రచారం చేస్తున్న టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు(ఫైల్)

మోర్తాడ్: పార్లమెంట్ ఎన్నికల వేడి గల్ఫ్ దేశాలను తాకింది. సోమవారం పోలింగ్ జరగనుండగా ఇక్కడ ప్రచారానికి శనివారం సాయంత్రంతోనే తెరపడింది. గల్ఫ్‌లో ఎన్నికల ప్రచారానికి ఎలాంటి నిబంధనలు అవసరం లేకపోవడంతో ఆదివారం కూడా క్యాంపులలో విస్తృతమైన ప్రచారం కొనసాగించడం విశేషం. గల్ఫ్‌లో ఉన్న మూడు ప్రధాన పార్టీల కార్మిక నాయకులు ప్రతి రోజు కార్మికుల క్యాంపులలో విస్తృతంగా పర్యటిస్తున్న ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులతో తమ పార్టీల అభ్యర్థులకు ఓటు వేయించాలని కోరారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో జోరుగా సాగుతున్న ప్రచారం మాదిరిగానే గల్ఫ్ దేశాల్లోను ఎన్నికల ప్రచారం జరగడం విశేషం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని దుబాయి, షార్జా, అబుదాబి ప్రాంతాల్లోని లేబర్ క్యాంపులలో టీపీసీసీ దుబాయ్ కన్వీనర్ ఎస్‌వీ రెడ్డి ప్రచారం చేశారు. వలస కార్మికులను కలుసుకుని వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసేలా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ బోర్డుకు సుముఖంగా ఉందని ఎంపీలను గెలిపిస్తే మరిన్ని డిమాండ్లను సాధించుకోవచ్చని ఆయన ప్రచారం కొనసాగిస్తున్నారు. అలాగే గల్ఫ్‌లోని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, మద్దతుదారులు కూడా వలస కార్మికులను కలుసుకుని తమ పార్టీల అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రతి రోజూ ప్రచారం



లేబర్ క్యాంపులలో సాయంత్రం వేళ పర్యటించి రోజు ప్రచారం చేశాం. బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఇంటికి ఫోన్ చేసి చెప్పాలని కార్మికులను కోరాం.
– తోట రమేశ్ పటేల్,
బీజేపీ గల్ఫ్ కన్వీనర్, బహ్రెయిన్

సరిహద్దులో పటిష్ట నిఘా


సాలూర చెక్ పోస్టు వద్ద కార్లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బోధన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా డబ్బు, మద్యం అక్రమ రవాణా నియంత్రణకు అధికార యంత్రాంగం మహారాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సాలూర మండల శివారులోని అంతరాష్ట్ర చెక్ పోస్టు, పొతంగల్ మండల శివారులో, రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామం అంతరాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఆదివారం చెక్ పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల వైపు నుంచి రవాణా అవుతున్న కార్లు, ఇతర వాహనాలను తనిఖీలు చేపట్టారు. సోమవారం పోలింగ్ జరుగనున్నందున పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.

చెరువుకు చేరిన ఊరు




ఈ చిత్రం చూశారా... ఊరే చెరువుకు చేరినట్టు ఉంది. మంచిర్యాల జిల్లా తాండూర్‌లోని చేపల ప్రియులంతా చెరువు బాట పట్టారు. గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఆదివారం వేకువజాము నుంచే చేపలు పడుతున్న విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు స్వగ్రామాలకు రావడంతో చేపల ప్రియులంతా చెరువు వద్దకు చేరుకుని చేపలు కొనుగోలు చేశారు. పెద్ద సైజు చేపలు తక్కువ రేటుకు దొరకడంతో పోటాపోటీగా కొనుగోలు చేశారు. - తాండూర్

జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాల వద్ద వరదలో బైక్



జంగాంలో ఆటోపై విరిగిపడిన విద్యుత్ స్తంభం



మండుటెండల్లో గాలివాన బీభత్సం

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/కెరమెరి/జైనూర్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లా కేంద్రంలో దాదాపు రెండు గంటలపాటు వర్షం కురిసింది. స్థానిక పీటీజీ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు కూలిపోయాయి. కుర్చీలు కొట్టుకుపోయాయి. పలు కాలనీల్లో చెట్లు విరిగి పడ్డాయి. సందీప్‌నగర్‌లో మూడు స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ, బూర్గుడ, అప్పపల్లి, ఈదులవాడ గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గుండి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన తెగి రాకపోకలు నిలిచిపోయాయి. జైనూర్ మండలం జంగాంలో విద్యుత్ స్తంభం విరిగి గ్రామానికి చెందిన సయ్యద్ సల్మాన్ ఆటోపై పడింది. ఆటో ముందు భాగం ధ్వంసమైంది. కెరమెరి మండలంలోని ఝరి, మోడి సాంగ్వి, గోయగాం, అనార్‌పల్లి, కెలి కె, రింగన్‌ఘాట్, జోడేఘాట్ ఇందాపూర్, నిషాని గ్రామాల్లో వర్షం కురిసింది. సాంగ్వి కల్వర్టు పైనుంచి వరద పారింది.


తెగిన గుండి వాగు తాత్కాలిక వంతెన


సాంగ్వి కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు


జిల్లా కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కూలిన టెంట్లు

ఎన్నికల విధుల్లో.. ఎస్సై సోదరులు


మావల, జైనథ్ ఎస్సైలు విష్ణువర్ధన్, పురుషోత్తం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద అన్నాదమ్ముళ్లు ఇద్దరు ఎస్సైలు ఆదివారం ఒకే చోట విధులు నిర్వర్తించారు. వీరిది మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామం. 2018 బ్యాచ్‌కు చెందిన వంగ విష్ణువర్ధన్ మావల ఎస్సైగా పనిచేస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఆయన సోదరుడు పురుషోత్తం జైనథ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. బందోబస్తు విధులకు సోదరులు హాజరు కావడంతో తోటి ఉద్యోగులు, సిబ్బంది ఆసక్తిగా గమనించారు. విష్ణువర్ధన్ గత రెండున్నరేళ్లుగా జిల్లాలో పనిచేస్తుండగా, ఆయన సోదరుడు ఏడాది నుంచి జైనథ్ ఎస్సైగా పనిచేస్తున్నారు.

కాలికి గాయమైనా.. పంపిణీ కేంద్రానికి



బోథ్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. సొనాల గ్రామానికి చెందిన ఓ మహిళా ఉద్యోగికి ఇటీవల కాలికి గాయమైంది. విధుల్లో భాగంగా ఆదివారం ఎన్నికల పంపిణీ కేంద్రానికి వచ్చింది. కాలి గాయంతో విధులు నిర్వహించలేని పరిస్థితి ఉండటంతో ఆమెను అధికారులు రిజర్వ్ చేశారు.

ఎన్నికల విధుల్లో తండ్రి, కూతురు



కుంటాల: సారంగాపూర్ మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన గుండ భూమేష్ జౌలిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె ప్రగతి కుంటాల మండలం సూర్యాపూర్ ఏఈఈవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వర్తించేందుకు ముధోల్ నియోజకవర్గానికి వచ్చినట్లు వారు ఆదివారం పేర్కొన్నారు.


దేవాపూర్‌లో మహిళా పోలింగ్ స్టేషన్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న అధికారులు


లంబాడితండాలో సిబ్బందికి స్వాగతం పలుకుతున్న అధికారులు, సభ్యులు

గ్రాండ్ వెల్‌కం

లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం వచ్చిన సిబ్బందికి మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో ఘన స్వాగతం లభించింది. మండలంలోని లంబాడితండా(కె) పోలింగ్‌స్టేషన్‌కు వచ్చిన సిబ్బందికి గ్రామస్తులు దప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించారు. లంబాడితండాలోని 30 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ప్రకటించడంతో ఏర్పాట్లు కూడా ఘనంగా చేసిన ఎంపీవో నాగరాజు, డీఆర్డీవో కిషన్, మహిళా సంఘం సభ్యులతో సిబ్బందిని స్వాగతించారు. దేవాపూర్‌లో 13వ నంబర్ పోలింగ్ బూత్ మహిళా పోలింగ్ బూత్‌గా ఎంపిక చేయడంతో పంచాయతీ కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి బొట్టు పెట్టి, గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఏర్పాట్లు పూర్తిచేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఓట్లు వేయాలని కోరారు. - కాసిపేట